ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేయాలి

కాప్రా: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్ సూచించారు. సోమవారం కమలానగర్‌లో జిల్లా స్థాయి ముఖ్య నేతలు మీడియాతో మాట్లాడుతూ.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును ఎమ్మెల్యేగా గెలిపించిన కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు పార్టీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ లోపభూయిష్టమైన పాలనతో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని విమర్శించారు. ప్రజా ఆకాంక్షలను పక్కనపెట్టి స్వార్థ, నియంత పోకడలను అనుసరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపారని తెలిపారు. బీఆర్‌ఎస్ ఇప్పటికైనా వీటిని గమనించి సమాజం గురించి ఆలోచించాలని సూచించారు. ప్రస్తుతం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాల అమలులో ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలన్నారు. నూతన ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డికి శుభాకాంక్షలు



మేడిపల్లి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రెండోసారి ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో సోమవారం పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వానికి అభినందనలు



అల్వాల్: శాసనసభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకొని ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైన కాంగ్రెస్ పార్టీకి, ఎన్నికైన శాసనసభ్యులకు లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌ను కలిసి ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఏర్పడనున్న ప్రభుత్వంపై ఉన్న బాధ్యతలు, సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ జేపీ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడనున్న ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గమనించి రాష్ట్రంలో కొనసాగాల్సిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కాస్త సమయం ఇవ్వాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం నడుచుకున్నంత వరకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రవీందర్, శివరామకృష్ణ, రోహిత్, వరకుమార్, సత్యనారాయణ, గణేష్ తదితరులు ఉన్నారు.

చిలుకానగర్‌లో బీఆర్‌ఎస్ సంబురాలు



ఉప్పల్: ఉప్పల్ ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో సోమవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వివిధ కూడళ్లలో బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉప్పల్‌లో లక్ష్మారెడ్డికి భారీ మెజార్టీ అందించడంతో ఇక్కడి ప్రజలకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ బండారి లక్ష్మారెడ్డి గెలిచే వరకు పాదరక్షలు లేకుండా ప్రచారం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. లక్ష్మారెడ్డి గెలుపుతో దీక్షను విరమించి సోమవారంతో పాదరక్షలను తిరిగి వేసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పిట్టల నరేష్, పల్లె నర్సింగరావు, నెర్ధం భాస్కర్‌గౌడ్, బింగి శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాప్రా ప్రెస్‌క్లబ్ సభ్యులు



కాప్రా: నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం కాప్రా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పలువురు జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన బీఎల్ఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాప్రా ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ అశోక్, జర్నలిస్టులు మెరుగు చంద్రమోహన్, మోతె వెంకట్ రెడ్డి, బాల్‌రాజ్, బాల్‌రెడ్డి, సురేష్, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ విజేత వీబీఐటీ

ఘట్‌కేసర్: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) చైర్మన్ డాక్టర్ గౌతంరావు అన్నారు. సోమవారం అవుషాపూర్‌లోని వీబీఐటీ క్యాంపస్‌లో వాలీబాల్ విజేతల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గతనెల 20, 21, 22 తేదీల్లో స్థానిక శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడల్లో వీబీఐటీ వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. అనంతరం స్పోర్ట్స్ కిట్స్, ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీబీఐటీ ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్, సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ డాక్టర్ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులు శివలాల్, కళ్యాణ్, నాగసాయి, పరమేశ్, సుదీప్, మహేశ్, పాషా, వెంకటేశ్, శ్రీనివాస్, లింగమ్మ పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రజల రుణం తీర్చుకోలేనిది

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారులు సోమవారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. మేడ్చల్‌ను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, సుధాకర్‌చారి, సింగన్న బాలరాజు, ఎల్లస్వామి, ప్రకాష్, పరుశురామ్, భాస్కర్, నర్సింహ, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

పదిలో ‘వంద’ లక్ష్యం

- ‘లక్ష్యం’ పేరుతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వేకువజామున చదివించేందుకు ఎంపిక చేసిన టీచర్లతో మానిటరింగ్
- సామర్థ్యంపై విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో పరీక్షలు
- ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ శ్రద్ధ



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటి వరకు నిమగ్నమై ఉన్న ఉపాధ్యాయులు.. అవి ముగిసిన నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై శ్రద్ధ తీసుకుంటోంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని పెంచి, వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేసేందుకు ‘లక్ష్య’ పేరుతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేయడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేసి, జనవరి నుంచి రివిజన్ చేసే ప్రక్రియను కొనసాగించేలా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

108 పాఠశాలల్లో 7 వేల మంది విద్యార్థులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 108 ఉన్నత పాఠశాలలో 7 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి పరిధిలోని మూడు జిల్లాల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే.. కొత్తగా ఏర్పడిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2016-17 సంవత్సరంలో 85.22 శాతం, 2017-18లో 87.90 శాతం, 2018-19లో 92.98 శాతం. 2020-21లో 92 శాతం, 2022-23 విద్యా సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని 108 ప్రభుత్వ హైస్కూళ్లలో ఇప్పటికే డిజిటల్ విద్య అమల్లో ఉంది. గతేడాది పదో తరగతిలో ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

‘పది’లో మెరుగైన ఫలితాలు లక్ష్యం

పదిలో ఉత్తమ ఫలితాలు లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ‘లక్ష్యం’లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికలు ముగియటంతో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో సిలబస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈసారి జిల్లా నుంచి పదో తరగతిలో అత్యధిక మార్కులు విద్యార్థులు సాధించేలా కృషి చేస్తున్నాం.

- ఐ.విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా.

విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో..

పాఠశాల పని దినాల్లో ఉదయం వేళల్లో బాలికలకు, సాయంత్రం బాలురకు ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులను నిర్వహించేలా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. వారానికి దాదాపు 12 క్లాసులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో నాలుగు క్లాసులు గణితం, ఐదు క్లాసులు సామాన్య శాస్త్రం, మూడు క్లాసులు సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పదో తరగతి విద్యార్థులను ఫిబ్రవరి నుంచి ప్రతిరోజూ ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్రలేపేందుకు కూడా ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోంది.

బండారి లక్ష్మారెడ్డికి అభినందనలు



మల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి నాచారం డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత నెమలికొండ భూపాల్‌రెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ అభివృద్ధి బండారి లక్ష్మారెడ్డితో సాధ్యమవుతుందని, ప్రజలు ఆయనకు పట్టం కట్టారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఆయన లక్ష్యం అన్నారు.

మర్రి రాజశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని మల్కాజిగిరి నియోజవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులు, అభిమానులు బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



అభినందనల వెల్లువ

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిచిన మర్రి రాజశేఖర్‌రెడ్డిని సోమవారం అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వినాయక్‌నగర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు గుత్తి రాంచందర్, ఎం.ఆర్.శ్రీనివాస్ యాదవ్, సాయికుమార్, నవీన్, సాయి దుర్గ, సాయిరాం, ఓజాల్, బాలకృష్ణలు మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మర్రి రాజశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



మర్రి రాజశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వినాయక్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నేతలు

విజ్ఞానాన్ని పెంచేందుకే విహార యాత్రలు



బోడుప్పల్: విహార యాత్రలు మానసిక ఉల్లాసంతో పాటు విజ్ఞానాన్ని పెంచుతాయని బోడుప్పల్ జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ జె.గంగరాజు అన్నారు. జేజీఆర్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సోమవారం హైదరాబాద్‌లోని మౌంట్ ఒపెరాను తిలకించేందుకు విహార యాత్రకు వెళ్లారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైడ్స్, వేవ్‌పూల్స్, రెయింగ్ డ్యాన్స్, బోటింగ్‌లను సందర్శించి సంతోషంగా గడిపారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఈ విహార యాత్ర ఓ ఆట విడుపుగా మారింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆటపాటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు ఫరీన్‌సల్మా, ఆస్మా, కీర్తన, మహేశ్వరి, ఝాన్సీ, హేమలత విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ అభినందనీయం



మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

మల్లాపూర్: ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ రావడం అభినందనీయమని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ అన్నారు. నాచారంలోని టీయూజేఏసీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జేఏసీ నాయకులను కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ గెలుపులో తెలంగాణ జేఏసీ ఉద్యమకారుల పాత్ర గణనీయమైందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గౌరవభృతి ఇస్తామని పేర్కొనడంతో ఉద్యమకారులు గెలుపునకు కృషి చేశారన్నారు. హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. టీయూజేఏసీ నాయకులు కనుకుంట్ల విజయ్‌కుమార్, వంజ మధు, పొన్నాల వినోద్, బాలాజీనాయక్, హఫీజ్, సునీల్, నర్సింగ్‌రావు, శాంతారామ్, రాములు పాల్గొన్నారు.

మధు యాష్కికి కలిసిరాని ఎల్‌బీనగర్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్నప్పటికీ మారిన రాజకీయ పరిణామాల కారణంగా ఎన్నికల ముందు వచ్చిన మధుయాష్కిగౌడ్‌కు ఎల్‌బీనగర్ ప్రజలు షాక్ ఇచ్చారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి రెండుసార్లు కాంగ్రెస్, ఒకసారి తెలుగుదేశం పార్టీలు విజయం సాధించగా ఈసారి గులాబీ జెండాకు జైకొట్టారు. 2009లో ఏర్పడిన ఎల్‌బీనగర్ నియోజకవర్గం మినీ ఇండియకు మారు పేరు. అధిక శాతం విద్యావంతులు కావడంతో ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇస్తారో తెలియని అయోమయం. 2009లో జరిగిన ఎన్నికలలో ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి టీడీపీపైన విజయం సాధించాడు. 2014లో బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య బీఆర్‌ఎస్ అభ్యర్థి రాంమోహన్‌గౌడ్‌పై విజయం సాధించగా సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి మూడో స్థానానికి పరిమితమయ్యారు. 2018లో సుధీర్‌రెడ్డి మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాంమోహన్‌గౌడ్‌పై విజయం సాధించారు. తర్వాత సుధీర్ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడంతో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బ తగిలింది. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాభావం చవిచూసింది.

కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణాలు..

సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరడంతో పార్టీ ముఖ్యనాయకులు కూడా ఆయనతో పాటు బీఆర్‌ఎస్ చేరారు. దీంతో సరైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ చతికిలపడ్డది. కరోనా సమయంలో పార్టీ సేవలు కానీ, విపత్కర సమయంలో ప్రజలకు ఆ పార్టీ నాయకులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌కు దూరం అయ్యారని చెప్పవచ్చు. గ్రేటర్ ఎన్నికలలో మల్‌రెడ్డి రాంరెడ్డిని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నియమించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యతను ఆయన మీద ఉంచారు. మరో సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సైతం పార్టీ పటిష్టతకు పాదయాత్రలు నిర్వహించారు. అయినా ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ బలోపేతం కాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు మధుయాష్కిగౌడ్ ఎల్‌బీనగర్ నుంచి కాంగ్రెస్ నుంచి తనే పోటీ చేస్తానని పేర్కొనడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి ఈ పంచాయతీని ఢిల్లీకి తీసుకెళ్లారు. అయినా అధిష్టానం మధుయాష్కిగౌడ్‌కే ప్రాధాన్యం ఇవ్వడంతో టికెట్టు ఆయననే వరించింది. బీసీ నేతనైన తనకు బీసీలు మద్దతు ఇచ్చి గెలిపిస్తారని ఆశతో బరిలోకి దిగారు.

కలిసిరాని బీసీ జపం

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 2014లో బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య బీసీ నేపంతో పోటీ చేయడంతో అధిక మెజార్టీతో ప్రజలు గెలిపించారు. దీంతో అదే ఫార్ములా పని చేస్తుందనే ఆశతో కాంగ్రెస్ తరఫున మధుయాష్కిగౌడ్ ఎల్‌బీనగర్ నుంచి పోటీ చేశాడు. కానీ ప్రజలు ఈసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టి కాంగ్రెస్‌ను తిరస్కరించారు. ఏకంగా కాంగ్రెస్ ఈ ఎన్నికలలో మూడో స్థానానికి పరిమితమయ్యింది. బీజేపీ రెండో స్థానంలో నిలిచింది.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



కాప్రా: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా కుషాయిగూడ ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు ప్రస్తావించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

కాళహస్తీశ్వర స్వామి అలంకరణలో..



గౌతంనగర్: కార్తీకమాసం సందర్భంగా వాణీనగర్ విజయ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళహస్తీశ్వర స్వామి అలంకరణలో ఉమామహేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

కన్నుల పండువగా క్షీరాభిషేకం



కీసర: కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి(శివలింగం)కు వేదపండితులు క్షీరాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం అందులో శివుడికి ఇష్టమైన సోమవారం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. అనంతరం భక్తులు కీసరగుట్ట దిగువ ప్రాంతంలోని హుడా పార్కులో కుటుంబ సమేతంగా వనభోజనాలు చేసి సేద తీరారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం పూజలు



ఘట్‌కేసర్: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా పట్టణంలోని శివారెడ్డిగూడ శివాలయం, అంకుషాపూర్, ఎదులాబాద్ శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, లింగాలకుంటలో స్వామివారికి పంచామృత అభిషేకం, జలాభిషేకం, తులసి అర్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జగదీశ్‌గౌడ్, వెంకటేశ్, మల్లికార్జునరాజు, ఆలయ పూజారి వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పార్టీ మారతారన్న వార్తలు అవాస్తవం



కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలతో మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: బీఆర్‌ఎస్ మారుతారన్న వార్తలు అవాస్తమని మర్రి రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పలు సామాజిక మాధ్యమాల్లో కేటీఆర్ సమావేశానికి హాజరుకాకపోవడంతో పార్టీ మారుతారన్న పుకార్లు షికార్లు చేశాయి. ఆ వార్తల్లో వాస్తవం లేదని ఉదయం దేవాలయాల దర్శనానికి వెళ్లి వచ్చే సరికి కార్యకర్తలు నాయకులు ఇంటి వద్ద ఎక్కువ మంది ఉండటంతో సమావేశానికి హాజరు కాలేకపోయామన్నారు. ఎర్రవెల్లిలో ముఖ్యమంత్రిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నానని, పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఎల్ఆర్





కాప్రా: బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప్పల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను బీఎల్ఆర్ కలిశారు.

కేటీఆర్‌ను కలిసిన బీఎల్ఆర్

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేతో సమావేశమైన సందర్భంగా కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా బీఎల్ఆర్ ప్రత్యేకంగా కలిశారు.

చరిత్రలో మూడోసారి

మేడ్చల్: మేడ్చల్‌లో ఏ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారం ఉంటుంది. మేడ్చల్‌కు 14 సార్లు ఎన్నికలు జరగ్గా మూడుసార్లు మినహా అన్నిసార్లు అధికార పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవిని ఎక్కువ మంది ఎమ్మెల్యేలు చేపట్టారు. తాజాగా సిట్టింగ్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినా ఆయన ప్రాతినిధ్యం వహించిన బీఆర్‌ఎస్ మాత్రం రాష్ట్రంలో అధికారంలోకి రాలేకపోయింది. దీంతో మంత్రిగా పనిచేసిన మల్లారెడ్డి ఈసారి ఎమ్మెల్యేగానే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చరిత్రలో ముగ్గురే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు..

మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు 14 సార్లు ఎన్నికలు జరగ్గా మూడుసార్లు మాత్రమే ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలో మేడ్చల్‌లో కాంగ్రెస్ గెలిచింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉమావెంకట్రాంరెడ్డి కాంగ్రెస్ తరఫున టీడీపీ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డిపై విజయం సాధించారు. 2004లో వైఎస్ఆర్ ప్రభంజనంలో టీడీపీ గెలిచింది. టీడీపీ తరఫున పోటీ చేసిన దేవేందర్‌గౌడ్ టీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. 2023లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన మల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్‌పై పోటీచేసి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మూడుసార్లు రాష్ట్రంలో ఒక పార్టీ, మేడ్చల్‌లో మరొకటి గెలిచింది.

మద్యం, డబ్బులు విపరీతంగా పంచారు

కాంటెస్టెడ్ బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి మద్యం, డబ్బులు విపరీతంగా పంచి విజయం సాధించారని, మల్లారెడ్డి గెలుపు గెలుపే కాదని కాంటెస్టెడ్ బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలకు కష్టం వస్తే అండగా నిలుస్తానని అన్నారు. ఎన్నికల్లో దీవించిన ప్రజలందరికీ ధన్యవాదాలని, ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.

బీఆర్‌ఎస్ విజయోత్సవాలు

ఘట్‌కేసర్: బీఆర్‌ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యేగా మంత్రి మల్లారెడ్డి విజయం సాధించడంతో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఒకటో వార్డు కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌సీనగర్‌లో బాణాసంచా కాల్చి విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అశ్విని, చంద్రశేఖర్, బాబురావు, సుశీల, రమణ పాల్గొన్నారు.

